ఆధునిక సాగుపై ఆసక్తి



డ్రమ్‌సీడర్‌తో వరినాట్లు వేస్తున్న రైతు



డ్రమ్‌సీడర్‌తో వేసిన నాటు

ఎల్లారెడ్డిపేట: మారుతున్న కాలానుగుణంగా అన్నదాతలు ఆధునిక వ్యవసాయంపై ఆసక్తి చూపుతున్నారు. వ్యవసాయశాఖ అధికారుల సూచనలతో రైతులు పంటల సాగులో నూతన పద్ధతులు అవలంబిస్తుండటంతో అన్నదాతలకు పెట్టుబడి భారం తగ్గుతుంది. ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ఊతమిస్తూ నూతన వ్యవసాయ వంగడాలపై అధికారులతో అవగాహన కల్పిస్తూ అవసరమైన పనిముట్లను అందుబాటులోకి తీసుకువస్తున్నారు. రైతులకు తక్కువ అద్దెపై పనిముట్లు అందిస్తున్నారు. మండలంలోని 24 గ్రామాలు, పది తండాల పరిధిలో ఈ వానాకాలం సీజన్‌లో 17వేల ఎకరాల్లో వరినాట్లు వేయనున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేయగా అందులో డ్రమ్ సీడర్‌తోనే 8వేల ఎకరాల్లో రైతులు వరినాట్లు వేసేందుకు సన్నద్ధమయ్యారు. ఖరీఫ్ సీజన్‌లో డ్రమ్‌సీడర్‌తో 8వేల ఎకరాల్లో వరినాట్లు వేసి జిల్లాలోనే మండల రైతులు ఆదర్శంగా నిలిచారు. కూలీల కొరత ఎక్కువగా ఉంటుండటంతో డ్రమ్ సీడర్ పద్ధతితో వరినాట్లు వేస్తూ ఎకరాకు రూ.10వేల వరకు ఖర్చులు రైతులకు ఆదా అవుతోంది.

- తగ్గుతున్న పెట్టుబడి భారం
- డ్రమ్‌సీడర్‌తో నేరుగా వరినాటు
- ఎకరాకు రూ.10వేల వరకు ఆదా
- కూలీల కొరతకు చెక్
- మండలంలో 17వేల ఎకరాల్లో వరి సాగు

డ్రమ్‌సీడర్‌తోనే నేరుగా వరినాట్లు

రైతులు వడ్లు నానబెట్టి మొలకెత్తిన తర్వాత నారుమడుల్లో చల్లి వరినారును పెంచి నాట్లువేయడం అనేది అనాదిగా వస్తోంది. అయితే మారిన కాలానుగుణంగా డ్రమ్‌సీడర్‌తోనే నేరుగా వరివిత్తును నాటుతున్నారు. దీంతో నారు మొలకెత్తే వరకు పెంచడం, నాట్లు వేసే సమయంలో నారు గుంజడం, నారు పీకడం లాంటి నాటు వేసేందుకు కూలీల ఖర్చులన్నీ ఈ పద్ధతితో రైతులకు ఆదా అవుతోంది. ఈ ఖర్చులన్నీ కలిపితే ఎకరం విస్తీర్ణంలో నాటు వేసేందుకు రూ.10వేలు వరకు ఖర్చయ్యే అవకాశం ఉంది. డ్రమ్‌సీడర్‌తో రైతులకు పెట్టుబడి భారం తప్పడంతో నూతన పద్ధతిలో వరి సాగు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు.

విత్తనాలు ఆదా..

- మామూలు పద్ధతితో ఎకరాకు 25 నుంచి 30 కిలోల నుంచి విత్తనాలు అవసరముంటాయి.
- డ్రమ్‌సీడర్‌తో కేవలం 12 నుంచి 15 కిలోల వరకే విత్తనాలు అవసరముంటాయి.
- నాటు వేసేందుకు ఖర్చు తప్పడంతోపాటు డ్రమ్‌సీడర్‌తో వరుస పద్ధతిలో 12 ఇంచుల గ్యాప్‌తో నాటు ఉంటుంది.
- పంటకు చీడపీడలు సోకితే సులభంగా ఎరువులు, క్రిమి సంహారక మందులు పిచికారీ చేసే అవకాశం ఉంది.
- వేరు వ్యవస్థ కోత కోయడానికి అనుకూలంగా ఉంటుంది.
- డ్రమ్‌సీడర్‌తో నాటువేస్తే వారం ముందుగానే పంట చేతికి వస్తుంది.

అవగాహన కల్పించాలి



వ్యవసాయ పద్ధతిలో అనేక మార్పులు వస్తున్న నేపథ్యంలో వ్యవసాయ అధికారులు రైతులకు నూతన యంత్రాలపై అవగాహన కల్పించాలి. యంత్రాల పనితీరు, ఖర్చు తదితర వివరాలు తెలిపితే నూతన పద్ధతిలో వరినాటు వేస్తాం. డ్రమ్‌సీడర్‌తో వరినాట్లు వేసిన వారు పెట్టుబడి భారం తగ్గినట్లు చెబుతున్నారు.

– అజ్మీరా లక్ష్మణ్, రైతు, గుంటపల్లి చెరువుతండా

రైతులు దృష్టి సారించాలి



రైతులు మారుతున్న కాలానుగుణంగా ఆధునిక వ్యవసాయంపై దృష్టిసారించాలి. వ్యవసాయ శాఖ అధికారులు సూచనలతో నూతన పద్ధతులు అవలంబిస్తూ పెట్టుబడి ఖర్చు తగ్గించుకోవాలి. డ్రమ్‌సీడర్‌తో వరినా ట్లు వేస్తే కూ లీల కొరత తగ్గి పెట్టుబడి వ్యయం తగ్గుతుంది. రైతులంతా ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలి.

– చాడ భూంరెడ్డి, వ్యవసాయ అధికారి, ఎల్లారెడ్డిపేట

క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బోయినపల్లి: రత్నంపేట పరిసరాల్లో ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎల్.శ్రీకాంత్ తెలిపారు. పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో అనుమతి పత్రాలు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్ కనిపించడంతో స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ వివరించారు.

నలుగురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు

ఎల్లారెడ్డిపేట: రాచర్లగొల్లపల్లి శివారులో ఆదివారం పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మద్యం తాగి వాహనాలు నడుపుతున్న నలుగురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇచ్చే తల్లితండ్రులపై కేసులు నమోదు చేస్తామన్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

బోయినపల్లి: తడగొండ గ్రామం నుంచి గంగాధర వెళ్లే డబుల్ రోడ్డులో స్థానిక సాయిబాబా ఆలయం నుంచి అంబేడ్కర్ విగ్రహం పరిసరాల్లో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆ ప్రాంత వాసులు వేముల సత్యం, చంద్రారెడ్డి తదితరులు పేర్కొన్నారు. వాహనదారులు విపరీతమైన వేగంతో వెళ్లడంతో ఈ ప్రాంతంలో గతంలో జరిగిన రెండు వేరువేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారని తెలిపారు. ఆ తర్వాత పలుసార్లు జరిగిన రోడ్డు ప్రమాదాల్లో పలువురు గాయపడ్డట్లు వాపోయారు. వాహనాల వేగానికి మూగజీవాలు సైతం బలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

మోడీ, అద్వాణీ చిత్రపటాలకు క్షీరాభిషేకం



తంగళ్లపల్లి: మండల కేంద్రంలో ఆదివారం బీజేపీ మండల అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, ఎల్‌కే అద్వాణీ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. శ్రీధర్‌రావు మాట్లాడుతూ.. గావ్ చలో–బస్తీ చలో అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరైన సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిలర్ గూడూరి భాస్కర్ మాట్లాడుతూ.. అద్వాణీకి భారతరత్న రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. నాయకులు కాశీచరణ్, కోల ఆంజనేయులు, కోడం భవిత తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి చేయూత



ఆర్థిక సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

కోనరావుపేట: కొలనూర్ గ్రామ పంచాయతీలో కార్మికుడిగా పని చేసిన మేర్గు రాములు భార్య ఇటీవల గుండెపోటుతో మృతిచెందగా.. పాఠశాల పూర్వ విద్యార్థులు తమవంతు సాయం అందజేశారు. రాములు, కుమారుడు ఆంజనేయులు అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆంజనేయులుతో కలిసి చదువుకున్న తోటి విద్యార్థులు రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. వీరితో పాటు 2009–10 బ్యాచ్ విద్యార్థులు రూ.10,111 ఆర్థిక సాయం చేశారు. నాగరాజు, నరేశ్, కనకయ్య, బాబు, రాకేశ్, అనిల్, సంధ్య, శిరీష, లావణ్య, దివ్య, అపర్ణ, మమత, జమేన, రమ్య తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య శ్రీరాముడి చిత్రపటాల పంపిణీ

కోనరావుపేట: కనగర్తిలో అయోధ్య శ్రీరాముడి చిత్రపటాలను పంపిణీ చేశారు. భజన మండలి సభ్యులు పోగుల రవీందర్‌రెడ్డి, బెంద్రం శ్రీనివాస్‌రెడ్డి, అనుపాటి భూంరెడ్డి, సోల్పాటి నర్సింహారెడ్డి, సగ్గు లచ్చిరెడ్డి, దొడ్డ రాజిరెడ్డి, బత్తుల స్వామి, వంగపెల్లి రాములు, అర్చకుడు ఆంజనేయశర్మ తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



వేములవాడఅర్బన్: మాస్టర్ గగ్గురి దివ్య ఆధ్వర్యంలో బెల్లంపల్లిలోని ఆర్యవైశ్య భవన్‌లో విక్టరీషోతోకన్ వారు నిర్వహించిన నేషనల్ లెవల్ కరాటే కుంగ్‌ఫూ టోర్నమెంట్‌లో పట్టణంలోని 32 మంది విద్యార్థులు పాల్గొన్నారు. 25 మంది గోల్డ్, సిల్వర్, బ్రౌన్ పతకాలు సాధించినట్లు తెలిపారు. అమిత్, శ్రీనివాస్, ప్రసాద్, వెంకటేశ్, సురేశ్ అభినందించారు.

అబద్ధాలు ప్రచారం చేసి గెలిచారు



మాట్లాడుతున్న వినోద్‌కుమార్

గంభీరావుపేట: కాంగ్రెస్ పార్టీ అబద్ధాలు చెప్పి దొడ్డిదారిలో అధికారంలోకి వచ్చిందని, నిజాన్ని నమ్మకుండా చేసి ప్రజలను తప్పుదోవ పట్టించిందని కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. గజసింగరంలో టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు ఆధ్వర్యంలో మండలంలోని సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యుల ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జెడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ, సెస్ డైరెక్టర్ గొరినేని నారాయణరావు, మాజీ సర్పంచుల ఫోరం మండల కన్వీనర్ రాజిరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, ప్రధాన కార్యదర్శి గంధ్యాడపు రాజు, నాయకులు రాజారాం, దయాకర్‌రావు, లక్ష్మణ్, సురేందర్‌రెడ్డి, లింగంయాదవ్, ఎగదండి స్వామి తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మ బోనాలు



వీర్నపల్లి: కంచర్ల గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ సిద్దోగం వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు ఇంటికో బోనం చొప్పున బయలుదేరి పెద్దమ్మకు బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బైండ్ల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అభివృద్ధికి కట్టుబడి పని చేస్తున్న ప్రభుత్వం



భూమిపూజ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు

చందుర్తి: అభివృద్ధికి కట్టుబడి పని చేయడమే ప్రభుత్వ లక్ష్యమని జెడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్ అన్నారు. రామరావుపల్లె గ్రామంలోని బీరప్ప దేవాలయం వద్ద బోరుబావి, మోటారుకు రూ.1.50లక్షలతో ఆదివారం భూమిపూజ చేశారు. ఎంపీటీసీ సభ్యుడు మ్యాకల గణేశ్, సింగిల్‌విండో డైరెక్టర్లు కేతిరెడ్డి నాగిరెడ్డి, అజయ్‌రెడ్డి, పెద్ది తిరుపతి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న క్రీడలతో క్రీడాకారుల మధ్య స్నేహభావం పెంపొందుతుందని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి, మాజీ సర్పంచ్ గొల్లపల్లి మల్లేశం అన్నారు. సింగారంలో షేక్ గూడమ్మ జ్ఞాపకార్థం షేక్ మహబూబ్ ఆధ్వర్యంలో ఆదివారం మండల స్థాయి క్రీడ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. నాయకులు గనగోని శ్రీనివాస్, మంగోళి శ్రీనివాస్, నాగరాజు, బాబు, క్రీడాకారులు పాల్గొన్నారు.



అపూర్వ సమ్మేళనం

కోనరావుపేట: సుద్దాల ఉన్నత పాఠశాలలో 2009–10 విద్యాసంవత్సరంలో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. పాఠాలు చెప్పిన గురువులను ఆహ్వానించి సన్మానించారు. సహపంక్తి భోజనాలు చేశారు.

నాలుగు దశాబ్దాలు.. నాలుగు తరాలు



సిరిసిల్లకల్చరల్: బతుకుదెరువు వెతుక్కుంటూ తలో దిక్కున స్థిరపడినా వారంతా అనుబంధాలు గుర్తొచ్చి ఒకచోట చేరారు. నాలుగు తరాలకు చెందిన వాళ్లు ఆదివారం సిరిసిల్లలోని వస్త్ర, వ్యాపార సంఘం భవనంలో కలుసుకున్నారు. ఒకే గోత్రంతో ఉన్న ఆ కుటుంబాల్లోని సభ్యులందరూ గత 40 ఏళ్లుగా కలుసుకోలేకపోయారు. యాంత్రికంగా గడిచిపోతున్న కాలానికి భిన్నంగా అందరినీ ఒకేచోట కలపాలని సంకల్పించారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న తమ కుటుంబ సభ్యులను కలుసుకున్నారు. కష్టసుఖాలు పంచుకున్నారు. సహపంక్తి భోజనాలతో సంబంధాలను మెరుగుపరచుకున్నారు. మహేశుని లక్ష్మీనారాయణ, శంకరయ్య, రమేశ్, తిరుపతి, రంజిత్‌కుమార్ బంధువర్గాలని ఏకం చేయడంలో కృషి చేశారు.

ఏగిన మురళి సేవలు మరువలేనివి



మురళి కాంస్య విగ్రహం ఆవిష్కరిస్తున్న ఆది శ్రీనివాస్, నాయకులు

వేములవాడ: రాష్ట్రంలోనే అతిపెద్ద హాలుతో ఉన్న వాసవీ ఆర్యవైశ్య సత్రం మూడు దశాబ్దాల క్రితం సుదూర ప్రాంతాల నుంచి రాజన్న దర్శనం కోసం వచ్చే ఆర్యవైశ్యులకు వసతి సౌకర్యం కల్పించేందుకు ఏర్పాటు చేశారని, ఆర్యవైశ్యులంతా ఏగిన మురళి సేవలను గుర్తుంచుకోవాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సత్రం అధ్యక్షుడు బుస్స శ్రీనివాస్, నాయకులు అన్నారు. పట్టణంలోని ఆర్యవైశ్య సత్రంలో ఆదివారం ఏగిన మురళి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు.

అన్ని వర్గాలకు సమన్యాయం

వేములవాడఅర్బన్: ప్రజా ప్రభుత్వంలో అన్ని వర్గాలకు సమన్యాయం ఉంటుందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ మున్సిపల్ పరిధి శాత్రాజుపల్లిలోని రజక సంఘం భవనాన్ని ప్రారంభించారు. వార్డు కౌన్సిలర్ సంఘ హనుమవ్వ, పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి, సంఘస్వామియాదవ్, లింగంపల్లి కిరణ్, గుడిసె సదానందం, మ్యాకల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కృతజ్ఞత ర్యాలీ

గుర్రవానిపల్లి గ్రామంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో కృతజ్ఞత ర్యాలీ నిర్వహించారు. ఆది శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు. మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య, మాజీ సర్పంచ్ లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్‌కు వినతి పత్రం

తంగళ్లపల్లి: రాళ్లపేట గ్రామంలోని పెద్దమ్మ దేవాలయానికి కాంపౌండ్ వాల్ ఏర్పాటు చేయాలని రాళ్లపేట ముదిరాజ్ సంఘం నాయకులు అన్నారు. ఆదివారం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను కలిసి ఆలయ పరిస్థితి వివరించి వినతి పత్రం అందజేశారు. సోమ నాగరాజు, నర్సయ్య, నాగయ్య, శ్రీకాంత్, తిరుపతి, కిషన్, భానుచందర్ తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక



బస్వాపూర్ రజక సంఘం సభ్యులు

తంగళ్లపల్లి: బస్వాపూర్ గ్రామ రజక సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బూరుగుపల్లి బాలయ్య, ఉపాధ్యక్షుడిగా కంచర బుచ్చయ్య, కోశాధికారిగా బూరుగుపల్లి రవికుమార్ ఎన్నికయ్యారు. నాయకులు, కుల పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నర్సాపూర్ అసెంబ్లీ ఇన్‌చార్జిగా వెంకటేశ్వర్‌రెడ్డి



ముస్తాబాద్: భారతీయ జనతా పార్టీ నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ముస్తాబాద్ మాజీ జెడ్పీటీసీ మట్ట వెంకటేశ్వర్‌రెడ్డి నియామకమయ్యారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పని చేస్తున్న సీనియర్ నాయకుడు మట్ట వెంకటేశ్వర్‌రెడ్డికి పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అధిష్టానం నర్సాపూర్ నియోజకవర్గ బాధ్యతలను అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

పద్మశాలీ సంఘం ఎన్నిక



కొలనూర్‌లో కార్యవర్గ సభ్యులు

కోనరావుపేట: పద్మశాలీ సంఘం కొలనూర్ గ్రామ అధ్యక్షుడిగా గాజుల రమేశ్ ఎన్నికయ్యారు. ఆదివారం సమావేశమైన సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా దాసరి లక్ష్మీనారాయణ, కుల పెద్దగా గాజుల సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా ఇమ్మడిశెట్టి జనార్దన్, ప్రధాన కార్యదర్శిగా గాజుల రాజేశం, కోశాధికారిగా ఇమ్మడిశెట్టి సుదర్శన్, కార్యవర్గ సభ్యులుగా ఆడెపు మల్లేశం, గాజుల రాజు, మద్దిరాల లక్ష్మణ్, ఇమ్మడిశెట్టి రవి, గోషిక కమల, ఆడెపు సుగుణ ఎన్నికయ్యారు.

అన్నదానం చేసిన ఏసీపీ దంపతులు



వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయం వద్ద ఆకలితో అలమటిస్తున్న పేదలకు వరంగల్ ఏసీపీ రాధిక–కృష్ణ దంపతులు ఆదివారం మై వేములవాడ ట్రస్టు సభ్యులతో కలిసి అన్నదానం చేశారు. వారి వెంట మధు మహేశ్, పొలాస రాజేందర్, చల్ల సత్తయ్య తదితరులున్నారు.

రిటైర్డ్ ఐజీకి సత్కారం



ముస్తాబాద్: ముస్తాబాద్ పీపుల్స్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్, ఐఎంఏ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ చింతోజు శంకర్ ఆధ్వర్యంలో జమ్మూకాశ్మీర్ రిటైర్డ్ ఐజీ రాజేంద్రకుమార్‌ను ఆదివారం ఘనంగా సన్మానించారు. దేశ సరిహద్దుల్లో రాజేంద్రకుమార్ చేసిన సేవలను డాక్టర్ శంకర్ కొనియాడారు. క్లాస్‌మేట్‌గా, స్నేహితుడిగా రాజేంద్రకుమార్ తమకు ఎంతో ప్రేరణగా నిలిచారన్నారు. ఆయన దేశానికి చేసిన సేవలు మరచిపోలేమని పేర్కొన్నారు. డాక్టర్ వివేకానంద, డాక్టర్ దయాకర్, డాక్టర్ విజయ్, డాక్టర్ వంశీధర్, మానేరు స్వచ్ఛంద సంస్థ చైర్మన్ చింతోజు భాస్కర్, చింతోజు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పోక్సో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు సన్మానం

చందుర్తి: తమతో కలిసి చదువుకున్న చిన్ననాటి మిత్రుడు, రాజన్న సిరిసిల్ల జిల్లా కోర్టులో పోక్సో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియామకమైన పెంట శ్రీనివాస్‌ను తోటి మిత్రులు ఘనంగా సన్మానించారు. చందుర్తి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో కలిసి చదువుకున్న చిన్ననాటి మిత్రులందరూ కలిసి ఆదివారం సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నారు. శ్రీనివాస్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియామకం కావడాన్ని హర్షిస్తూ బాల్య విశేషాలను గుర్తు తెచ్చుకున్నారు. మేడికాల అంజయ్య, మరాఠి దామోదర్, ఉప్పుల మహేశ్, కట్ట రాములు, ఎడ్ల వెంకటేశం, కత్తి రాజాగౌడ్, రవితేజ, మేడిశెట్టి ప్రభాకర్, అజిత్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం

రుద్రంగి: రాష్ట్ర సాంఘిక శాస్త్ర ఫోరం ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలో శనివారం జరిగిన జిల్లాస్థాయి సోషల్ ప్రతిభ పరీక్షలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికైన మానాల జెడ్పీ హైస్కూల్ విద్యార్థి గుర్రపు అజయ్‌ని ఆదివారం మానాల గ్రామస్తులు సన్మానించారు.

మాజీ పాలకవర్గానికి సన్మానం



దుమాలలో సన్మానిస్తున్న గ్రామస్తులు

ఎల్లారెడ్డిపేట: దుమాల గ్రామ పంచాయతీ పాలకవర్గ మాజీ సభ్యులను ఆదివారం గ్రామస్తులు, అధికారులు ఘనంగా సన్మానించారు. ఐదేళ్ల పాటు సేవ చేసే అదృష్టం కలిగించిన గ్రామస్తులను జీవితంలో మరచిపోలేమని మాజీ సర్పంచ్ కదిరే రజిత అన్నారు. అన్ని కుల సంఘాలు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

గోపాల్‌రావుపల్లె పాలకవర్గానికి సన్మానం

తంగళ్లపల్లి: గోపాల్‌రావుపల్లె గ్రామ తాజా మాజీ పాలకవర్గానికి ఆదివారం గ్రామస్తులు వీడ్కోలు పలుకుతూ సన్మానించారు. మాజీ సర్పంచ్ కూతురు పద్మ వెంకట్‌రెడ్డి, ఉప సర్పంచ్ నక్క సతీష్, వార్డు సభ్యులను శాలువాతో సత్కరించారు. బీఎస్పీ మండల అధ్యక్షుడు గుండు ప్రేమ్‌కుమార్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు వెంకట్‌రెడ్డి, ఆశా రేణుక, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయండి

బోయినపల్లి(చొప్పదండి): మండల కేంద్రంలో మేరు సంఘం భవన నిర్మాణానికి రూ.10లక్షల నిధులు మంజూరు చేయాలని మండల మేరు కుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మాడిశెట్టి నరేందర్ ఆధ్వర్యంలో నాయకులు ఆదివారం కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌ని కలిసి వినతి పత్రం సమర్పించారు. మాడిశెట్టి శ్రీనివాస్, రాములు, రామగిరి రాజు, తెంబరవేని వేణు, రాపర్తి హరీశ్, రామగిరి తిరుపతి, మాడిశెట్టి రామదాసు తదితరులు పాల్గొన్నారు.

కళాశాల వార్షికోత్సవం

సిరిసిల్లకల్చరల్: పట్టణంలోని మహతి మహిళా డిగ్రీ కళాశాల 11వ వార్షిక సంబరాలు అంబరాన్ని తాకాయి. స్థానిక సుభాష్‌నగర్‌లోని సిరిసిల్ల ఏసీ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన వేడుకలను కరస్పాండెంట్ డాక్టర్ పి.రాజు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఫౌండర్ ప్రిన్సిపాల్ భూమేశ్ వార్షిక నివేదిక సమర్పించారు. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో సంబరాలను హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడికి గురి కావొద్దు

సిరిసిల్లకల్చరల్: పదోతరగతి పరీక్షలు రాసే సమయంలో విద్యార్థులు ఎలాంటి మానసిక ఒత్తిడికి లోనుకావొద్దని మోటివేషనల్ స్పీకర్ ఎర్ర ప్రవీణ్‌కుమార్ అన్నారు. నెహ్రూనగర్‌లోని జెడ్పీ హైస్కూల్‌లో పదోతరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై దిశానిర్దేశం చేశారు. ఉపాధ్యాయులు గన్నమనేని శ్రీనివాసరావు, రోమాల లచ్చయ్య పాల్గొన్నారు.

మొక్కులు చెల్లించుకున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: రాచర్లగొల్లపల్లి శివారులోని సత్తే పీరీల దర్గాలో ఆదివారం కాంగ్రెస్ నాయకులు మొక్కులు చెల్లించుకున్నారు. పార్టీ అధికారంలోకి వస్తే కందూర్ చేస్తామని కార్యకర్తలు నేవూరి సంతోష్‌రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, మర్రి శ్రీనివాస్‌రెడ్డి మొక్కుకున్నారు. బ్లాక్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య మాట్లాడుతూ.. ప్రజల ఆశీర్వాదంతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసి అన్నదానం చేశారు. మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్‌కే గౌస్, కొమిరిశెట్టి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.